క్లుప్తంగా

ఉపాధ్యాయులు బాధ్యతగా విధులు నిర్వహించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

జగిత్యాల: ఉపాధ్యాయులు బాధ్యతగా విధులు నిర్వహించాలని డీఈవో రాము అన్నారు. బుధవారం ప్రాథమిక ఉన్నతస్థాయి కాంప్లెక్స్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు తమ బాధ్యతగా విధులు నిర్వహించి విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలన్నారు. కార్యక్రమంలో విద్యాధికారులు కిశోర్, నాగభూషణం, శంకరయ్య పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సౌజన్య

జగిత్యాలరూరల్: మహిళ సాధికారతపై అవగాహన కలిగి ఉండాలని యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ యూనిట్ సభ్యురాలు సౌజన్య అన్నారు.జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు పలు పథకాలు, మహిళల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, బాలబాలికలకు బాల్య వివాహాలవల్ల ఎంతో నష్టం జరుగుతుందని, బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వీవోఏ లలిత, మహిళ సాధికారత సభ్యులు స్వప్న, హేమశ్రీ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయదారులకు జరిమానా



జరిమానా విధిస్తున్న కమిషనర్

ధర్మపురి: పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్లాస్టిక్‌ను విక్రయించిన వారికి జరిమానా విధించినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా ధర్మపురి పట్టణంలో బుధవారం పలు దుకాణాలలో కమిషనర్ ఆధ్వర్యంలో సోదాలు చేసారు. ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను స్వాధీనం చేసుకుని జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



అవగాహన కల్పిస్తున్న సెక్టోరియల్ అధికారి

రాయికల్: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని జిల్లా సెక్టోరియల్ అధికారి సత్యనారాయణ అన్నారు. మండలంలోని అల్లీపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం పాఠశాలల సముదాయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఆదర్శ బోధన పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో రాఘవులు,హెచ్‌ఎం మామిడాల శ్రీనివాస్, జిల్లా రిసోర్స్ పర్సన్ అభయ్‌రాజ్, మండల రిసోర్స్ పర్సన్ ఉషకోల రాజు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీ



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

కథలాపూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి ప్రమోద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని అన్ని విభాగాలను పరిశీలించి, మందుల నిలువలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఎంత మందికి చికిత్సలు అందిస్తున్నారని, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిరికొండలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, వైద్యాధికారి సింధూజ ఉన్నారు.

ఆలయాల్లో ధనుర్మాసోత్సవాలు

జగిత్యాలటౌన్: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారంపట్టణంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామునుంచే భక్తులు ఆలయాలకు క్యూకట్టారు. పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయం, బైపాస్ రోడ్డులోని అష్టలక్ష్మి ఆలయం, మార్కండేయ ఆలయం, ధరూర్ క్యాంపులోని శ్రీకోదండరామాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కోదండ రామాలయంలో జరిగిన భజనకు మాతలు మంగళ హారతులతో ఏకరూప దుస్తుల్లో హాజరై ప్రత్యేక పూజలు చేశారు.



కోదండరామాలయంలో భజనలు చేస్తున్న మాతలు

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ



పడిపూజలో అయ్యప్పస్వాముల పూజలు

మల్లాపూర్: మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో బుధవారం అయ్యప్ప స్వామి మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప దీక్షదారులు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామి వారి విగ్రహానికి పంచామృత అభిషేకములు నిర్వహించి మహాపడిపూజ నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాముల శరణుఘోష, భజన పాటలతో ఆ ప్రాంగణమంత మారుమోగింది.

ఘనంగా గట్టుమల్లన్నస్వామి జాతర



పూజలు చేస్తున్న భక్తులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తిలో బుధవారం ఘనంగా గట్టుమల్లన్న జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున భక్తులు మల్ల న్నస్వామికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

మల్యాల



మల్యాల: మండలంలోని తక్కళ్లపల్లిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. భవనం పైకప్పు ఊడిపోయి, వర్షానికి తరగతి గదిలోకి నీరు చేరుతోంది. పాఠశాల హెచ్‌ఎం లింగయ్య శంకరయ్య, స్థానికుల సహకారంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 25 నుంచి 73 కు చేరింది. తరగతి పెంకులు ఊడిపోయి శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నూతన భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
జయసింహారావు, ఎంఈవో,మల్యాల సెల్ నంబర్: 9391203388

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

'డబుల్' ఇళ్లలోకి గృహప్రవేశం

జగిత్యాల: నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీలో నిర్మించిన డబుల్ ఇళ్లలోకి పలువురు గృహప్రవేశం చేశారు. కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హాజరయ్యారు. నిరుపేదల కల సాకారమవుతోందన్నారు. డ్రెయినేజీలు, సెప్టిక్ ట్యాంక్‌లు, నీటి వసతులు కల్పించామని, త్వరలో అన్ని వసతులు పూర్తవుతాయని, అందరితో గృహప్రవేశం చేయిస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, కమిషనర్ చిరంజీవి, ఏఈ చరణ్ ఉన్నారు.



దంపతులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బుధవారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును మార్యదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జగిత్యాల నియోజకవర్గానికి టూరిజం ప్రాజెక్ట్ మంజూరు చేయాలని, అలాగే జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేటలో నగర్–1 ప్రాజెక్ట్ అలాగే బీర్‌పూర్ మండలం రోల్లవాగు ప్రాజెక్టలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

స్థలాన్ని కేటాయించాలి

జిల్లా కేంద్రంలో నవోదయ, కేజీబీవీ, మహిళా శక్తి భవనాల నిర్మాణం కోసం అవసరమైన స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల ఆర్డీవో మధుసూదన్‌తో చర్చించారు. స్థలాన్ని త్వరగా గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

సారంగాపూర్: బీర్‌పూర్‌లో ఈశ్వరయ్య అనే వ్యక్తి ఇంటిలో దొంగలు పడి నగదు, బంగారం ఎత్తుకెళ్లగా వారిని ఎమ్మెల్యే పరామర్శించారు. పోయిన బంగారం, ఇతర సొమ్ములను రికవరీ చేయాలని పోలీసులకు సూచించారు.

జగిత్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని ధరూర్ క్యాంపు లోగల చర్చిలో బుధవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొని కేక్ కట్‌చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ధర్మపురి: సీఎం కప్ పోటీల్లో భాగంగా జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ధర్మపురిలోని మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు సిందూజ, ముస్కాన్, సిద్దిక, అక్షయ, లస్మిత రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు.

ధర్మపురి: సీఎం కప్ పోటీల్లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ధర్మపురి మండల బాలికలు ఎంపికైనట్లు ఎంఈవో సీతామహలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఎంఈవో అభినందించారు.

సారంగాపూర్: సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి అల్లెపు రాజవర్ధన్ రాష్ట్రస్థాయిలో జరిగే బయోలజీ టాలెంట్ టెస్ట్‌కు ఎంపికయ్యాడు. జిల్లా స్థాయిలో జరిగిన టాలెంట్ టెస్ట్‌లో రెండో స్థానంలో నిలిచి, ఈ నెల 28న రాష్ట్రస్థాయి జరిగే పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో కిషోర్ తెలిపారు.

రాయికల్: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన రయాన్ అనే క్రీడాకారుడు బ్యాడ్మింటన్ అండర్– 14 విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా రయాన్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కథలాపూర్ విద్యార్థులు ఎంపిక

కథలాపూర్: మండల కేంద్రంలోని కళాధార పబ్లిక్ స్కూల్‌కు చెందిన హైందవి, రిశ్వంత్, చరణ్ అనే విద్యార్థులు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కమలాకర్, పీఈటీ అజయ్ బుధవారం తెలిపారు.

ఖోఖో పోటీల్లో రన్నరప్‌గా సారంగాపూర్

సారంగాపూర్: జిల్లా కేంద్రంలో జరిగిన సీఎం కప్ క్రీడల్లో సారంగాపూర్ మండల బాలికల జట్టు ఖోఖో పోటీల్లో జిల్లాలో రెండో స్థానంలో నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్ లో కథలాపూర్ మొదటి స్థానంలో, సారంగాపూర్ విద్యార్థులు రెండో స్థానంలో (రన్నరప్) నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పీడీ అనంతుల రవీందర్‌ను ఎంపీడీవో చౌడారపు గంగాధర్, ఎంఈవో కిశోర్ అభినందించారు.

జాతీయ స్థాయి ఫెడరేషన్ కప్‌లో ధర్మపురి విద్యార్థినికి పతకం

ధర్మపురి: ఈనెల 17న న్యూ ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పెడరేషన్ కప్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మగ్గిడి మోడల్ స్కూలుకు చెందిన భూక్య శ్రావణి 52 కిలోల విభాగంలో నేషనల్ ఫెడరేషన్ కప్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ మహేష్ ఫిజికల్ డైరెక్టర్ రాజేందర్ తదితరులు అభినందించారు.

గ్రామాల అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం

రాయికల్: గ్రామాల అభివృద్ధే కేంద్రం ధ్యేయమని రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. మండలంలోని రామాజీపేటలో మున్నూరుకాపు సంఘ భవనానికి ఎంపీ ఫండ్స్ కింద నిధులు మంజూరు కాగా, భోగ శ్రావణి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీ ధర్మపురి అర్వింద్ సహకారంతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అన్నవేని వేణు, ప్రధాన కార్యదర్శి తీపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు ముత్యంరెడ్డి, మున్నూరుకాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.



సంఘం భవనానికి భూమిపూజ చేస్తున్న శ్రావణి

కాల్వలు శుభ్రం చేయాలి

సాక్షి స్పందన

సారంగాపూర్: సారంగాపూర్, పోతారం,బట్టపల్లితో పాటు రేచపల్లి గ్రామాలకు సాగునీరు అందించే డీ–53, 12 ఎల్–1ఆర్ కాలువ రేచపల్లి లంబాడా తండా వద్ద కాలువ నిండా మట్టి నిండి దిగువన రైతులకు నీరందడం కష్టంగా మారింది. దీనిపై బుధవారం సాక్షి లో ఫొటో స్టోరీ ప్రచురితం కాగా, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ స్పందించి డీఆర్‌డీవో అధికారులు, ఎంపీడీవో గంగాధర్‌కు రైతులకు సాగునీరందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు ఈజీఎస్ ఏపీవో శ్రీలత, టెక్నికల్ అసిస్టెంట్ శివ సందర్శించి, కొన్ని సాంకేతిక కారణాలతో కాలువల్లో పూడిక తీయడం సాధ్యం కావడం లేదని పేర్కొన్నారు.

చెక్కులు పంపిణీ

రాయికల్: మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన ఆరుగురికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చొరవతో సీఎం రిలీఫ్‌ఫండ్ కింద రూ.2.19 లక్షలు మంజూరు కాగా, బుధవారం కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, నాయకులు తలారి రాజేశ్, పాలడుగు నర్సింహారెడ్డి, బొమ్మెన బాపు, లక్ష్మణ్, నారాయణ పాల్గొన్నారు.

మెనూలో కోడిగుడ్డు సాధ్యం కాదు

జగిత్యాల: మార్కెట్‌లో కోడిగుడ్డు ధరలు అధికంగా పెరిగినందున విద్యార్థులకు వడ్డించలేమని డీఈవోకు మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్‌లో కోడిగుడ్డు రేటు పెరగడంతో రూ.3 నష్టం వస్తుందని, దీనిని వడ్డించడం ఇబ్బందికరంగా ఉందన్నారు. మమ్మల్ని అర్థం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

తెలిసిన వాళ్లకే ఓపీ లు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కొందరు తెలిసిన వారికే తొందరగా ఓపీ రాస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. లైన్‌లో ఉదయం నుంచి నిలబడుతున్నా వారిని కాదని ఆస్పత్రిలో పనిచేసే సిబ్బంది తెలిసిన వారికే రాస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆర్‌ఎంవో నవీన్‌ను వివరణ కోరగా, అలాంటిది తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హైడ్రా కమిషనర్‌కు నృసింహుని ప్రసాదం

ధర్మపురి : హైడ్రా కమిషనర్, ఐపీఎస్ ఏవీ రంగనాథ్‌ను బుధవారం జిల్లా మున్నూరుకాపు గౌరవ అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య తదితరులున్నారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

జగిత్యాలక్రైం: గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి అన్నారు. గల్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ వలస దారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గల్ఫ్ వలసలను గుర్తుచేస్తూ ప్రజా ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో గల్ఫ్ జేఏసీ అధ్యక్షుడు రవిగౌడ్, నాయకులు మంద భీం రెడ్డి, శ్రీనివాస్, కాంతక్క, తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్‌ను అవమానించటం సరికాదు'

కోరుట్ల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అవమానించటం సరికాదని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పట్టణంలోని జువ్వాడి భవన్‌లో బుధవారం మాట్లాడారు. పార్లమెంట్‌లో అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యల్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్ గౌడ్, కొంతం రాజం, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

మల్లాపూర్: మండల ఎస్సైగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎస్సై కొసన రాజును బుధవారం కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని హన్మాండ్లు, మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. వారి వెంట కట్కం గంగారెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు తేలు నరేశ్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మారుతి, నాయకులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ధర్మపురి: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఉదయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం షీ టీం, సైబర్ క్రైమ్ పై పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్సై హాజరై మాట్లాడారు. విద్యార్థినులను ఎవరైనా వేధిస్తే 100 కు డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

• అర్హులందరికీ ఇళ్లు కట్టించి ఇవ్వాలి

కోరుట్ల: అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లు కట్టించి ఇవ్వాలని సీపీఐ నాయకులు చెన్నా విశ్వనాథం, సుతారి రాములు డిమాండ్ చేశారు. స్థానిక సి.ప్రభాకర్ భవన్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు.అనంతరం మహిళలతో కలిసి ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. గతంలో 1500 మంది అర్హులు ఉన్నారని గుర్తించారని పేర్కొన్నారు. అందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేశ్, ఎద్దండి భూమయ్య, ఎండీ మౌలానా, హనుమంతు, దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

• ఎన్పీడీసీఎల్ సీఎండీని కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్: ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డిని బుధవారం జిల్లాకు చెందిన ఐఎన్‌టీయూసీ–327 నాయకులు కలిసి, తమ సమస్యలను విన్నవించారు. జూనియర్ లైన్‌మెన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏను వెంటనే విడుదల చేయాలని, ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎన్. బాలు, రాజమల్లు, ఉత్తం నాయక్, రవీందర్, నాగరాజు పాల్గొన్నారు.

• ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలి

ఇబ్రహీంపట్నం: ఈ నెల 25 వరకు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో 100 శాతం ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలని, పారిశుద్ధ్యం లోపించకుండా పనులు చేపట్టాలని సూచించారు. ఇంటి పన్నులు ఈ నెల చివరి వరకు 80 శాతం వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో కొమరయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

• రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

మల్యాల: రైతులందరూ భూ పరీక్షలు చేసుకోవాలని, భూసార పరీక్షలతో ఎరువులు ఎంత మోతాదులో అవసరమవుతాయో తెలుసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి కె.చంద్రదీపక్ అన్నారు. మండలంలో ప్రతి గ్రామంలో ఏఈవోల ద్వారా భూసారా పరీక్షలకు మట్టి నమూనాలు సేకరిస్తున్నామన్నారు. భూసార పరీక్షలో భూమిలో ఉన్న ఖనిజ లవణాలు ఏ మేరకు ఉన్నాయి. పంటలకు అవసరమైన ఎన్‌పీఏ ఎరువులు ఏ మేరకు వినియోగించాలో స్పష్టత వస్తుందని, తద్వారా సంబంధిత ఎరువుల వినియోగం మోతాదులో వినియోగించడంతో పెట్టుబడి వ్యయంతోపాటు, భూసారం దెబ్బతినకుండ కాపాడవచ్చని ఏవో చంద్ర దీపక్ అన్నారు. రైతులు భూసార పరీక్షల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

• బీజేపీ బూత్ కమిటీ ఎన్నికలు

కథలాపూర్: మండలంలోని బొమ్మెన గ్రామంలో బూత్ కమిటీ ఎన్నికలు బుధవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా స్వామి, సురేశ్, ప్రధాన కార్యదర్శులుగా రవి, ఆనందం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు వెంకటేశ్వర్‌రావు, ఆనందరెడ్డి, బాపురెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

• ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల గ్రామంలో ట్రాక్టర్ల బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. గ్రామంలోని ఇట్టెడి గంగారెడ్డి, గడ్డం జలేందర్‌రెడ్డి అనే వ్యక్తుల ట్రాక్టర్లకు చెందిన బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్లారని గ్రామస్తులు పేర్కొన్నారు.

• అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

మల్లాపూర్: భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పూలేరి రాము, ఉపాధ్యక్షుడిగా నల్ల లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా బూరం వంశీ, కోశాధికారిగా పెద్దిరెడ్డి లక్ష్మణ్, రైటర్‌గా ఆకుతోట నర్సయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు బండారి రమేష్, మాట్ల సోమయ్య, నల్ల రాజేశ్వర్, నవీన్, ఆకుతోట చంద్రయ్య, సింగారపు అశోక్,తదితరులు పాల్గొన్నారు

కుక్కల దాడితో గొర్రె పిల్లలు మృతి

వెల్గటూర్ : కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతిచెందిన సంఘటన ఎండపల్లి మండలం చర్లపల్లిలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సంకటి మల్లయ్య బుధవారం ఊరి బయటకు తన గొర్రెలను మేతకు తీసుకొని వెళ్లాడు. ఆ సమయంలో 30 వరకు గొర్రె పిలలను షెడ్‌లోనే ఉంచి వెళ్లాడు. మధ్యాహ్నం పూట షెడ్‌లో ఎవరూ లేని సమయంలో కుక్కలు రేకుల షెడ్‌లో చొరబడి గొర్రెపిల్లలపై దాడిచేసి చంపేశాయి. ఈ దాడిలో 20 గొర్రెపిల్లలు మృతి చెందగా మరొకొన్ని గాయపడ్డాయి. వెటర్నరీ డా. శ్రీప్రియ మృతిచెందిన గొర్రెపిల్లలను పరిశీలించి, గాయపడ్డ వాటికి చికిత్స అందించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

• రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

సారంగాపూర్: మండలంలోని బట్టపల్లి గ్రామానికి చెందిన దాసరి సునీల్ అనే యువకుడు బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. జగిత్యాల నుంచి బట్టపల్లికి ద్విచక్రవాహనంపై వెలుతున్న సునీల్ సారంగాపూర్ అటవీప్రాంతంలో కల్వర్టును ఢీకొనడంతో రోడ్డుపై పడి తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే సునీల్‌ను చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జిల్లాలో 9.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో బుధవారం 10 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనాయి. మల్లాపూర్ మండలం రాఘవపేటలో 9.2, ఎండపల్లి మండలం గుల్లకోటలో 9.4, మల్లాపూర్ మండల కేంద్రంలో 9.5 డిగ్రిల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా ప్రాంతాల్లో 10 నుంచి 15 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రేపు అయ్యప్పస్వామి క్షేత్రం వార్షికోత్సవం

మల్యాల: మండల కేంద్రంలోని శ్రీ హరి హర అయ్యప్పస్వామి క్షేత్రం 8వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నామని ఆలయ వ్యవస్థాపకులు మిట్టపల్లి లక్ష్మీనారాయణ తెలిపారు. ఆలయ మూల విరాట్టుకు పంచామృతాభిషేకంతోపాటు, జలాభిషేకం, గంధాభిషేకం, తీర్థ, ప్రసాద వితరణ నిర్వహణ అనంతరం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సమాచారం

21న ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

జగిత్యాల: ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రోటరీ క్లబ్ జగిత్యాల ఆధ్వర్యంలో ఐఎంఏ భవన్‌లో ఈనెల 21న ఉదయం 10 నుంచి 2 గంటల వరకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు సభ్యులు మంచాల కృష్ణ తెలిపారు. ప్రముఖ వైద్యులు అమర్‌నాథ్, అర్చనరెడ్డి పాల్గొంటారని తెలిపారు. రిజిస్ట్రేషన్‌కు 98856 22332, 77299 85110 నంబర్లలో సంప్రదించాలని కోరారు.